

టన్ను చీనీ రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి. మార్కెట్‌కు 361 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



ఎంపీడీఓలకు స్థానచలనం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 24 మంది ఎంపీడీఓలకు స్థాన చలనం కలిగింది. 18 మంది పరిపాలనాధికారులు, ఈఓఆర్డీలకు పదోన్నతి లభించింది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం

40.8°/22.5°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు వేసవితాపం. ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

అన్నదాత ఆనందంగా ఉండాలి

- రైతును రాజును చేయాలన్నదే సీఎం జగన్ లక్ష్యం: జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- జిల్లా ప్రగతిలో రైతులు ప్రముఖ పాత్ర పోషించాలి: కలెక్టర్ అరుణ్‌బాబు
- 'రైతు భరోసా' కింద రూ.206.49 కోట్ల పెట్టుబడి సాయం విడుదల
- జిల్లాలో 2,75,331 మంది రైతులకు లబ్ధి



రైతు భరోసా పథకం లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, తదితరులు

పుట్టపర్తి టౌన్:అన్నదాతలు ఆనందంగా ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. 'వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్' పథకం కింద మొదటి పెట్టుబడి సాయంగా జిల్లాలో 2,75,331 మంది రైతులకు రూ 206.49 కోట్లు, మార్చిలో అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్న 716 మంది రైతులకు 49.2 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో జరిగిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లో జమచేశారు. ఈ సందర్భంగా స్థానిక సాయి ఆరామంలో కలెక్టర్ అరుణ్‌కుమార్‌తో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పలువురు లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు గ్రామాల్లోనే అందిస్తోందన్నారు. పంట ఉత్పత్తులను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తోందన్నారు. రైతులను పట్టించుకోకుండా గత పాలకులు నిట్టనిలువునా ముంచేశారని విమర్శించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటల సాగుపై అవగాహన కల్పించి, రాష్ట్రాన్ని హరితాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పంటలు అధిక విస్తీర్ణంలో సాగుచేసి జిల్లా అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తే మంచి లాభాలు పొందవచ్చని చెప్పారు. అనంతరం ఉద్యాన, వ్యవసాయ, పట్టు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, వ్యవసాయ యంత్రాలను కలెక్టర్, ప్రజాప్రతినిధులు వీక్షించారు. కార్యక్రమంలో డీఏఓ సుబ్బారావ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పుడా చైర్మన్ లక్ష్మినరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, ఆర్డీఓ భాగ్యరేఖ, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారి శుబదాస్, ఎంపీపీ రమణారెడ్డి, నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, డీసీసీ జిల్లా డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, తదితరులున్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలుస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. రైతు భరోసా పథకం ద్వారా మేలు చేస్తున్నారు. ఎవరి సిఫార్సు లేకుండానే నేరుగా మా ఖాతాల్లోకి నగదు జమవుతోంది. ఆయనకు రుణపడి ఉంటాం. – రఘునాథ్, రైతు, బొతలపల్లి, పుట్టపర్తి మండలం

రైతు భరోసా పథకం వరం



గతంలో పంటల పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పు చేయాల్సి వచ్చేది. పంట బాగా పండినా అప్పు, వడ్డీ చెల్లించడానికే సరిపోయేది. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత పెట్టుబడి సాయం అందిస్తుండడంతో ఎంతో ఉపశమనం కలుగుతోంది. రైతు భరోసా పథకం అన్నదాతలకు వరంలా మారింది. – వెంకటరమణారెడ్డి, రైతు, పూలకుంటపల్లి, తనకల్లు మండలం

గతంలో ఎన్నడూ లేదు



రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుబడి సాయం అందజేయడం గతంలో ఎన్నడూ లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ రైతు భరోసా పథకం ప్రవేశపెట్టారు. అధికారం చేపట్టినప్పటి నుంచి ఏటా డబ్బు అందిస్తున్నారు. 'రైతు భరోసా'తో అప్పు చేసే అవసరం లేకుండా పోయింది. – శివరామప్ప, కుమ్మరవాండ్లపల్లి, గాండ్ల పెంట మండలం

నేరుగా ఖాతాల్లోకే జమ



రైతు భరోసా పథకం కింద నగదు నేరుగా రైతుల అకౌంట్లలోనే జమ అవుతోంది. సీఎం వైఎస్ జగన్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విత్తనాలు, ఎరువులు ఉన్న ఊళ్లలోనే అందుతున్నాయి. అన్నదాతల బాధలు తప్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. – చెన్నుడు, రైతు, సిద్ధరాంపురం గ్రామం, బుక్కపట్నం మండలం

న్యూస్‌రీల్

వేగంగా కదిలి.. సంతోషం పంచి

- జిల్లాలో ఒకే రోజు 85 శాతం పింఛన్ల పంపిణీ



వెంగళమ్మచెరువులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బాబావలి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో గురువారం తెల్లవారు జామునే వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రారంభమైంది. మొదటిరోజే వలంటీర్లు 2,13,556 మందికి రూ.59,26,03,000 మేర నగదు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మరో నాలుగు రోజులు పింఛన్ పంపిణీ ఉంటుందన్నారు. ఒకటో తేదీ తెల్లవారుజామునే చేతికి పింఛన్ అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిగా హేమంత్‌రెడ్డి



అగ్నిమాపక శాఖ అధికారి హేమంత్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా అగ్ని మాపక శాఖ అధికారిగా హేమంత్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక కార్యాలయం వద్ద ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఇప్పటివరకూ అగ్నిమాపక శాఖ అధికారిగా వ్యవహరించిన శంకర్‌ప్రసాద్ తిరిగి తన యథాస్థానం (సత్యసాయి విమానాశ్రయం ఫైర్ స్టేషన్)కు వెళ్లారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ విపత్తుల నివారణపై జిల్లాప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నర్సాపూర్–యశ్వంతపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నర్సాపూర్ – యశ్వంతపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న నర్సాపూర్ జంక్షన్ (07687) నుంచి మధ్యాహ్నం 3.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు (5వ తేదీ) ఉదయం 10.50 గంటలకు యశ్వంతపూర్ చేరుతుందని, అదే విధంగా 5వ తేదీ యశ్వంతపూర్ జంక్షన్ (07688) నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి 6వ తేదీ ఉదయం 8.30 గంటలకు నర్సాపూర్ చేరుతుందని పేర్కొన్నారు. ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపూర్, గిద్దలూరు, నంద్యాల, డోన్, అనంతపురం, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, యలహంక మీదుగా యశ్వంతపూర్ చేరుతుందని తెలిపారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' కార్యక్రమాల్లో అందే ఫిర్యాదులను సంతృప్తకర స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. జగనన్నకు చెబుదాం, రీసర్వే, భూ సేకరణ, హౌసింగ్, తాగునీరు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. భూ సేకరణకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలన్నారు. లక్ష్యం మేర ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. ఎస్‌హెచ్‌జీ రుణాలు మంజూరు చేయించాలన్నారు. చెత్త శుద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రీ సర్వే కోసం భూముల డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు.

5న మడకశిరలో జిల్లా స్థాయి 'స్పందన'

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మడకశిర పట్టణంలో ఈ నెల 5న (సోమవారం) జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం సాగుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో మే నెలలో నిర్వహించిన బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ (ఏ) వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

జిల్లాలో పలువురు కమిషనర్ల బదిలీ

ప్రశాంతి నిలయం/ధర్మవరం: జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కమిషనర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పుట్టపర్తి కమిషనర్ వెంకట్రామిరెడ్డి కర్నూలు జిల్లా డోన్ మున్సిపాలిటీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరూ నియమితులు కాలేదు. ధర్మవరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను గుంతకల్లుకు, అక్కడి కమిషనర్ బండి కేసన్నను ధర్మవరానికి బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో డీఈఓకు తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన డీఈఓ మీనాక్షి, చెట్టును ఢీకొనడంతో దెబ్బతిన్న డీఈఓ ప్రయాణిస్తున్న కారు

- నాడు–నేడు పనులు పరిశీలించి వెళ్తుండగా ఘటన

రామగిరి: రోడ్డు ప్రమాదంలో డీఈఓ మీనాక్షికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని నసనకోట సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మండలంలోని రామగిరి, మాదాపురం, తిమ్మాపురం, పెద్ద కొండాపురం, దుబ్బార్లపల్లి పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను గురువారం డీఈఓ పరిశీలించారు. అనంతరం పుట్టపర్తి వెళ్తుండగా, ఆమె ప్రయాణిస్తున్న కారు నసనకోట గ్రామ శివారులో ఓ చెట్టును ఢీకొంది. ముందు సీట్లో కూర్చున్న డీఈఓ మీనాక్షి తల, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెతో పాటు కారులో ఉన్న ఏఎంఓ గోపాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 ద్వారా అనంతపురం తరలించారు.

అధికారుల ఆరా..

రాప్తాడురూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి ఎడమ మోకాలి వద్ద ఎముకలు విరిగడంతో శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపినట్లు అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ వెల్లడించారు. తలకు పెద్ద గాయాలు లేవని, అయితే, నుదిటపై గాయానికి కుట్లు వేయాలని వైద్యులు తెలియజేశారన్నారు. అనంతపురం నగర శివారులోని సవీరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డీఈఓ మీనాక్షిని ఆయన పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. అనంతపురం కలెక్టర్ గౌతమి, జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ కూడా ప్రత్యేకంగా వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. డీఈఓ మీనాక్షి, ఏఎంఓ గోపాల్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కాగా, రోడ్డు ప్రమాదంపై మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏఎంఓ గోపాల్‌కు ఫోన్‌చేసి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఐసీడీఎస్‌లో ఉద్యోగుల బదిలీ

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఐసీడీఎస్‌లో జూనియర్ అసిస్టెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రేడ్–2 సూపర్‌వైజర్లు, గ్రేడ్–1 సూపర్‌వైజర్లకు గురువారం ఉదయం బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. హిందూపురంలో పనిచేస్తున్న సుశీలాసౌభాగ్యవతిని సోమందేపల్లికి, తాడిపత్రి నుంచి రాజేశ్వరిని బత్తలపల్లికి, అనంతపురంలో పనిచేస్తున్న భారతీ దేవిని పుట్టపర్తికి, చిత్తూరు జిల్లా సత్యవేడులో పనిచేస్తున్న సంధ్యాని పుట్లూరుకు, మడకశిర నుంచి అరుణమ్మను ఉరవకొండకు, కూడేరులో పనిచేస్తున్న లీలావతి, హేమలత, మడకశిర నుంచి లావణ్య, కోయిలకుంట్ల నుంచి శ్రీవాణిని అనంతపురం రూరల్‌కు, కూడేరు నుంచి నేతాజీబీని బత్తలపల్లికి, కదిరి జయమ్మను నల్లచెరువుకు, కదిరి వెస్ట్ నుంచి సత్యవతి, గంగాదేవిని ఓడీ చెరువుకు బదిలీ చేశారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- జూన్ 4వ తేదీ ఉదయం 09:30 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు 1,000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation. com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి జూన్ 4వ తేదీ ఉదయం 09:30 నుంచి 12:30 వరకు అనంతపురంలోని Ambedkar Convention Centre, Sai Nagar నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికీ తెలిసిందే. హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబరుకు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ : జూన్ 4, 2023

వేదిక : అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్, సాయినగర్, అనంతపురం

సమయం : ఉదయం 09:30 నుంచి 12:30 వరకు

భూ సేకరణ త్వరగా పూర్తి చేయండి



భూ సేకరణపై సమీక్షిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, కొడికొండ చెక్‌పోస్ట్–హిందూపురం 544 రహదారి, ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 342, రైల్వే ప్రాజెక్టులకు భూ సేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియ సకాలంలో పూర్తి చేస్తే ప్రాజెక్టు త్వరగా పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, తిప్పేనాయక్,సూపరింటెండెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి ఇద్దరి మృతి



మృతి చెందిన కిరణ్, అంకప్ప

యల్లనూరు: ప్రమాదవశాత్తూ నీటికుంటలో మునిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. గడ్డంవారిపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన మేరకు... మల్లాగుండ్ల గ్రామానికి చెందిన ఎద్దు అంకప్ప(58)తో పాటు ఎనిమిదో తరగతి విద్యార్థి గిరిగారి కిరణ్(14), అశోక్ అనే వ్యక్తి గురువారం మధ్యాహ్నం సమీపంలోని గడ్డంవారిపల్లికి వెళ్లారు. ఎండల తీవ్రతకు గొంతు తడారడంతో ఓ రైతు పొలంలో ఏర్పాటు చేసిన నీటికుంట వద్ద నీరు తాగేందుకు వెళ్లారు. నీరు తాగే క్రమంలో కిరణ్ కాలుజారి కుంటలోపడ్డాడు. మునిగిపోతున్నాడని గుర్తించిన అంకప్ప కాపాడేందుకు నీటిలోకి దూకాడు. అయితే కుంట లోతు ఎక్కువగా ఉండటంతో కిరణ్‌తో పాటు అంకప్ప నీట మునిగారు. ఈ దృశ్యాన్ని చూసి భయకంపితుడైన అశోక్ పరుగున ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను తీసుకొచ్చాడు. అయితే అప్పటికే అంకప్ప, కిరణ్ మృతి చెందారు. అంకప్పకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఎస్‌ఐ రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కిరణ్ తండ్రి నారాయణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రాగులను సద్వినియోగం చేసుకోవాలి

సివిల్ సప్లయీస్ కమిషనర్ అరుణ్‌కుమార్



రేషన్‌కార్డుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ్‌కుమార్, జేసీ కేతన్‌గార్గ్

పుట్టపర్తి అర్బన్/పెనుకొండ: చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న రాగులను సద్వినియోగం చేసుకోవాలని సివిల్ సప్లయీస్ కమిషనర్ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. పెనుకొండలో గురువారం ఎండీయూ వాహనాల ద్వారా చేపడుతున్న రాగుల పంపిణీని జాయింట్ కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. రేషన్‌కార్డుదారులతో మాట్లాడారు. రాగులు పంపిణీ చేయడం తమకు సంతృప్తినిస్తోందని, జొన్నలు కూడా ఇస్తే మరింత బాగుంటుందని స్థానిక మహిళలు తెలిపారు. కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ కోసం డబ్బు అడిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాకు అవసరమైన సుమారు 706 మెట్రిక్ టన్నుల రాగులను కర్ణాటక రాష్ట్రం నుంచి తెప్పించామన్నారు. రాగుల కోసం కర్ణాటకపై ఆధార పడడం తగ్గిద్దామన్నారు. జిల్లాలో రాగి పంట విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని డీఏఓ సుబ్బారావును ఆదేశించారు. పంపిణీ ప్రారంభమైన గురువారం ఒక్కరోజే 15 మండలాల్లో 8 వేల కార్డులకు 6,500 కేజీలు పంపిణీ చేశామన్నారు. రాగులు పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం అశ్వర్థ నారాయణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

10 మంది ట్రెజరీ ఉద్యోగుల బదిలీ

అనంతపురం అర్బన్: ఖజానా (ట్రెజరీ) శాఖలో 10 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ డిప్యూటీ డైరెక్టర్ జె.సరళా విజయకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని సబ్ ట్రెజరీలు (ఎస్‌టీ), డివిజనల్ సబ్ ట్రెజరీ (డీఎస్‌టీ), జిల్లా ట్రెజరీలో (డీటీ) విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు సీనియర్ అకౌంటెంట్లు (ఎస్‌ఏ), నలుగురు ఆఫీస్ సబార్డినేట్లను (ఓఎస్) బదిలీ చేశారు.

బదిలీలు ఇలా...

పేరు– హోదా	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.గంగాధర్‌గౌడ్, ఎస్‌ఏ	గుంతకల్లు ఎస్‌టీ	రాయదుర్గం ఎస్‌టీ
ఆర్.తిమ్మప్ప, ఎస్‌ఏ	మడకశిర ఎస్‌టీ	హిందూపురం ఎస్‌టీ
ఎన్.ఖాదర్‌జిలాన్, ఎస్‌ఏ	హిందూపురం ఎస్‌టీ	జిల్లా ఖజానా, అనంతపురం
ఎస్.ముస్తక్ మహమ్మద్, ఎస్‌ఏ	జిల్లా ఖజానా	తాడిపత్రి, ఎస్‌టీ
ఎమ్.సుజాత, ఎస్‌ఏ	రాయదుర్గం ఎస్‌టీ	గుంతకల్లు ఎస్‌టీ
వై.పద్మావతి, ఎస్‌ఏ	తాడిపత్రి ఎస్‌టీ	జిలా ఖజానా, అనంతపురం
కె.మహబూబ్‌బీ, ఓఎస్	పెనుకొండ, డీఎస్‌టీ	జిల్లా ఖజానా, పుట్టపర్తి
సి.వెంకటేశులు, ఓఎస్	జిల్లా ఖజానా, అనంతపురం	గుత్తి, ఎస్‌టీ
టి.నారాయణప్ప, ఓఎస్	గుత్తి, ఎస్‌టీ	పెనుకొండ, డీఎస్‌టీ
పి.వెంకటరమణ, ఓఎస్	కొత్తచెరువు ఎస్‌టీ	జిల్లా ఖజానా, అనంతపురం

చెరువులు, కుంటలను పునరుద్ధరించాలి



జాయింట్ సెక్రటరీ తనూజ టక్కర్‌కు బాబా చిత్రపటాన్ని బహూకరిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: చెరువులు, కుంటలను పునరుద్ధరించాలని 'అమృత్ సరోవర్' జాయింట్ సెక్రటరీ తనూజ టక్కర్ పేర్కొన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన ఆమె గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా అమృత్ సరోవర్ పనులపై జిల్లా అధికారులు పవర్ ప్రజెంటేషన్ సమర్పించారు. అనంతరం జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రతిభ కనబరచి మూడో స్థానం సంపాదించిందన్నారు. దేశంలోని ప్రతి జిల్లాలో కనీసం 75 చెరువులను అభివృద్ధి చేయాలని కేంద్రం లక్ష్యం విధించుకుందని, ఈ ఏడాది ఏప్రిల్ 24న ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. కనీసం ఎకరా విస్తీర్ణంలో 10 వేల క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ ఉండేలా చెరువులను నిర్మించాలన్నారు. 69 లక్షల మందికి జాబ్ కార్డులు పంపిణీ చేశామని, రూ.2,300 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో 10 వేల క్యూసెక్కుల నీటిని నిల్వ చేసే నిమిత్తం 80 ట్యాంకులు నిర్మించడానికి ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నీటి కుంటల నిర్మాణంతో రైతులు ఉద్యాన పంటల వైపు ఆసక్తి చూపుతున్నారన్నారు. అనంతరం జాయింట్ సెక్రటరీకి సత్యసాయిబాబా చిత్రపటాన్ని కలెక్టర్ బహూకరించారు.

క్లుప్తంగా

ఖాద్రీశుని దర్శించుకున్న వడ్డెర కార్పొరేషన్ చైర్మన్



రేవతికి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న చైర్మన్ గోపాలకృష్ణ

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి గురువారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో ఆమెను ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, సిబ్బంది స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీసీ రమణ, గొల్లకుంట నాగరాజు, వడ్డెర్ల కార్పొరేషన్ డైరెక్టర్ శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెలు మృతి

బెళుగుప్ప: పిడుగుపాటుకు మూడు గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు.. బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి గురువారం ఉదయం తన గొర్రెలను శీర్పి రహదారి వైపు మేపునకు తోలుకెళ్లాడు. సాయంత్రం వర్షంతో పాటు పిడుగు పడడంతో మూడు గొర్రెలు మృతి చెందాయి. దీంతో రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

ముగిసిన అభ్యంతరాల పరిశీలన

- రాత్రి 11 గంటల వరకూ సాగిన ఉపాధ్యాయుల బదిలీల కసరత్తు
- నేడు తుది సీనియార్టీ జాబితా ప్రకటన



అభ్యంతరాలపై సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: ప్రభుత్వ టీచర్ల బదిలీలకు సంబంధించి ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాపై అందిన అభ్యంతరాలపై రెండు రోజులుగా సాగుతున్న పరిశీలన ప్రక్రియ గురువారం రాత్రి 11 గంటలకు ముగిసింది. ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాపై మొత్తం 731 అభ్యంతరాలు అందాయి. సైన్స్‌సెంటర్‌లో ప్రత్యేక బృందాలను నియమించి అభ్యంతరాలను పరిశీలన చేయించారు. ముందు రోజు అర్ధరాత్రి ఒంటిగంట వరకు పరిశీలన ప్రక్రియ సాగింది. రెండోరోజు రాత్రికి పూర్తయింది. డీఈఓ ఎం.సాయిరామ్ ప్రత్యేక పర్యవేక్షణలో అభ్యంతరాలను పరిశీలించారు. ఏ చిన్న సమస్య ఉత్పన్నం కాకుండా పలుమార్లు సిబ్బందిని డీఈఓ అప్రమత్తం చేస్తూ వచ్చారు. ఏ చిన్న అనుమానం వచ్చినా తనతో నివృత్తి చేస్తూ వచ్చారు. ప్రిపరెన్షియల్ కేటగిరీకి దరఖాస్తు చేసుకున్న ఇద్దరు హెచ్ఎంలు, ఇద్దరు టీచర్లపై కొందరు ఫిర్యాదులు చేశారు. అయితే ఆ ఇద్దరు జత చేసిన మెడికల్ సర్టిఫికెట్ల నిర్ధారణ కోసం జిల్లా విద్యాశాఖ అధికారి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు లేఖ పంపారు. అక్కడి నుంచి నిర్ధారణ వచ్చిన తర్వాత వీరిని ప్రిపరెన్షియల్ కేటగిరీలో చేర్చాలా...వద్దా? అనేది నిర్ణయిస్తారు. కొందరు స్పౌజ్ పెట్టుకుంటామని అడిగారు. కొందరు అర్హత లేకున్నా వివిధ కేటగిరీల కింద పాయింట్లు పెట్టుకున్నారని ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి అర్హత ఉన్నవాటిని మాత్రమే పరిగణలోకి తీసుకుని పాయింట్లు కేటాయిస్తున్నామని డీఈఓ స్పష్టం చేశారు. కాగా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు అర్హత సాధించిన పాయింట్లను జతచేసి శుక్రవారం ఫైనల్ సీనియార్టీ జాబితాను ప్రకటించనున్నారు. ఈనెల 4న ఖాళీల జాబితాను వెల్లడిస్తారు.

పట్టు పరిశ్రమ శాఖలో బదిలీలు

అనంతపురం అగ్రికల్చర్: పట్టు పరిశ్రమ శాఖ పరిధిలో గురువారం ముగ్గురికి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి సెరికల్చర్ ఆఫీసర్ (ఎస్‌ఓ) శివకుమార్ అనంతపురం జేడీ కార్యాలయానికి, కళ్యాణదుర్గం నుంచి టెక్నికల్ అసిస్టెంట్ బాబయ్య శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి, ఇదే జిల్లా పెనుకొండ నుంచి టెక్నికల్ ఆఫీసర్ రమేష్‌మూర్తి కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యారు.

సమ్మర్ స్పెషల్ ఒలింపిక్స్‌కు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం: ఈ నెల 12 నుంచి 28వ తేదీ వరకూ జర్మనీలోని బెర్లిన్‌లో జరిగే సమ్మర్ స్పెషల్ ఒలింపిక్స్‌కు అనంతపురం స్పోర్ట్స్ అకాడమీకి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ విభాగానికి సంబంధించి బ్యాడ్మింటన్ పోటీలకు డి.షమీలా, లోకేష్ నాసి, అలాగే టేబుల్ టెన్నిస్‌కు గుజ్జల అలివేలమ్మ, పవర్ లిఫ్టింగ్‌కు సుధామణి పూజారి ఎంపికయ్యారు. కోచ్ విభాగంలో పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఆశ దూదేకుల సయ్యద్, ఏహెడ్ విభాగం పవర్ లిఫ్టింగ్‌కు రాజశేఖర్ చెలి ఎంపికయ్యారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్, డీఐడీ డైరెక్టర్ ఆర్. దశరథరాముడు అభినందించారు.

ఉపాధి పనుల్లో నాణ్యత లోపించరాదు

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్



డబురువారిపల్లి వద్ద ఉపాధి పనులు పరిశీలిస్తున్న శివప్రసాద్

ఓడీ చెరువు: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ ఆదేశించారు. మండలంలోని డబురువారిపల్లి, నల్లగుట్లపల్లి పంచాయతీ పరిధిలో అమృత్ సరోవర్ కింద చెరువుల్లో చేపట్టిన పూడిక తీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. ప్రమాణాలు పాటించకపోవడంపై ఎంపీడీఓ పోలప్పపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది పర్యవేక్షణ లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ఇకపై పనులు ఇలాగే చేయిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు సూచించారు. కార్యక్రమంలో పీడీ రామాంజినేయులు, ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్య కాదు.. ప్రేరేపిత హత్య

- అదనపు కట్నం వేధింపులే కారణమన్న మృతురాలి తండ్రి
- రైల్వే ఎలక్ట్రికల్ జేఈపై కేసు నమోదు

గుంతకల్లు టౌన్: అదనపు కట్నం కోసం తమ కుమార్తెను వేధించి చివరకు ఆత్మహత్య చేసుకునేలా అల్లుడే ప్రేరేపించాడంటూ మృతురాలి తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు. దీంతో మృతురాలి భర్తపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య గురువారం వెల్లడించారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా వి.వెంకటంపల్లి గ్రామానికి చెందిన భిక్షం కుమారుడు రవి... గుంతకల్లులోని పీఅండ్‌టీ కాలనీలో నివాసముంటూ రైల్వే ఎలక్ట్రికల్ జేఈగా పనిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం ఖమ్మం జిల్లా నెలకొండపల్లి మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వరరావు కుమార్తె రుక్మిణితో ఆయనకు వివాహమైంది. పెళ్లి సమయంలో కట్న కానుకల కింద రూ.10 లక్షల నగదు, 15 తులాల బంగారం, 250 గజాల ఇంటి స్థలం, 20 కుంటల పొలాన్ని రుక్మిణి తల్లిదండ్రులు అందజేశారు. పెళ్లి అనంతరం గుంతకల్లులో తాను అద్దెకు ఉంటున్న ఇంటికి రవి మకాం మార్చాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం వీరికి ఓ బాబు పుట్టాడు. ప్రస్తుతం రుక్మిణి రెండు నెలల గర్భిణి. ఇటీవల అదనపు కట్నం కోసం రుక్మిణిని భర్త వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. ఆమెను పుట్టింటికి పంపకుండా, వారితో మాట్లాడకుండా కట్టడి చేశాడు. బుధవారం ఉదయం రుక్మిణితో గొడవ పడిన రవి ఆమె తండ్రికి ఫోన్ చేసి రుక్మిణిని పిలుచుకెళ్లాలని తెలిపి, ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన రుక్మిణి తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వేధింపులు తాళలేకనే తమ కుమార్తె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు రుక్మిణి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొన్న బొలెరో



బోల్తా పడిన ఆటో

హిందూపురం: మండలంలోని నందమూరి నగర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాల మేరకు హిందూపురం నుంచి చెర్లోపల్లికి ప్రయాణికులతో బయలుదేరిన ఆటో నందమూరి నగర్ వద్దకు చేరకోగానే స్పీడ్ బ్రేకర్ వద్ద వాహన వేగాన్ని డ్రైవర్ నియంత్రించాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. దీంతో ఆటో రోడ్డు పక్కన బోల్తా పడింది. ఘటనలో ఆటో డ్రైవర్ షరీఫ్, జంగాలపల్లికి చెందిన రామాంజనమ్మ, పత్తికుంటపల్లి నివాసి రామాంజనమ్మ, చెర్లోపల్లి శైలజ, సందీప్‌కు తీవ్రంగా గాయపడ్డారు. మేరీ, చంద్రశేఖర్, ప్రశాంతి, నరసింహప్పకు స్వల్ప గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న శైలజ, రామాంజినమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తపాలా శాఖలో బదిలీల షెడ్యూల్ విడుదల

అనంతపురం సిటీ: తపాలా శాఖలో పని చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల (జీడీఎస్) సాధారణ బదిలీల షెడ్యూల్‌ను ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం విడుదల చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు ఖాళీల వివరాలు ప్రకటన, 10 నుంచి 18వ తేదీ వరకూ బదిలీలకు సంబంధించి రిజిస్ట్రేషన్, దరఖాస్తుల సమర్పణ, 19 నుంచి 20వ తేదీ వరకూ ఆప్షన్ల నమోదు ఉంటుంది. 21 నుంచి 24వ తేదీ వరకూ దరఖాస్తుల పరిశీలన, 27న కౌన్సెలింగ్ అనంతరం జూలై 15లోపు బదిలీ అయిన ప్రదేశంలో ఉద్యోగులు విధుల్లో చేరాల్సి ఉంటుంది.

చోరీ కేసులో ముద్దాయికి జైలు

తిరుపతి లీగల్: తిరుమలలో జరిగిన ఓ చోరీ కేసులో శ్రీసత్యసాయి జిల్లా తనకల్లులోని రాజీవ్‌కాలనీకి చెందిన వి.రమేష్‌కు 2 నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు వెలువరించారు. 2020, ఫిబ్రవరి 19న తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు తిరుమల ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండగా అతని ప్యాంట్ జేబులోని వాలెట్ చోరీకి గురైంది. అందులో రూ.2 వేలు నగదు ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి రమేష్‌తో పాటు మరో ఇద్దరిని కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ దశలో నిందితుడు రమేష్ నేరం అంగీకరించడంతో శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మరో ఇద్దరిపై కేసు విచారణ జరగాల్సి ఉంది.

ఘర్షణ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

బుక్కరాయసముద్రం: ఘర్షణ కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి సుజన్‌కుమార్ తీర్పు వెలువరించారు. ఈ మేరకు బీకే ఎస్ ఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2017, మార్చిలో పొలం గట్టు వద్ద బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన మహేశ్వరిపై అదే గ్రామానికి చెందిన బుల్లే చిరంజీవి కట్టెతో దాడి చేశాడు. దీనిపై అప్పట్లో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. అప్పటి నుంచి వాదనలు జరుగుతూ వచ్చిన ఈ కేసు తుది తీర్పు గురువారం వెలువడింది. నేరం రుజువు కావడంతో ముద్దాయి చిరంజీవికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఆడిట్ శాఖలో ఆగిన బదిలీల ప్రక్రియ

అనంతపురం సిటీ: రాష్ట్ర ఆడిట్ శాఖ కర్నూలు రీజియన్‌లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గురువారానికి కూడా కొలిక్కి రాలేదు. మే 30లోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే ఆడిట్ శాఖలో మాత్రం మిగిలిన రీజియన్లలో బదిలీలు పూర్తయినా కర్నూలు రీజియన్‌లో మాత్రం పెండింగ్ పడటంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రీజనల్ అధికారులు బదిలీలకు అర్హులైన వారి జాబితా సిద్ధం చేసినా.. రాష్ట్ర స్థాయిలో ఓ అధికారి అడ్డుపడుతున్నట్లు ఆ శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి మే 30లోగా బదిలీలు పూర్తి కావాల్సి ఉందని, జూన్ ఒకటో తేదీ రాత్రికి కూడా బదిలీల జాబితా ప్రకటించకపోవడంపై అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు ఆడిట్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తెలిపారు.

ఎంపీడీఓలకు స్థాన చలనం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 మందికి స్థానాల కేటాయింపు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని 24 మంది ఎంపీడీఓలకు స్థాన చలనం కలిగింది. వారిలో రెగ్యులర్ ఎంపీడీఓలు ఆరుగురు ఉండగా, పదోన్నతి పొందిన పరిపాలనాధికారులు, ఈఓఆర్డీలు 18 మందికి పోస్టింగ్ ఇస్తూ జిల్లా పరిషత్ అధికారులు గురువారం రాత్రి 8.30 గంటలకు ఉత్తర్వులు జారీ చేశారు. కళ్యాణదుర్గం ఎంపీడీఓ ఎం.కొండన్నను నల్లమాడకు, బెళుగుప్ప నుంచి యాదవేంద్రను గాండ్లపెంటకు, చెన్నేకొత్తపల్లి నుంచి వి.సరస్వతిని పరిగికి, కనగానపల్లి నుంచి టి.లక్ష్మీనారాయణను యాడికికి, రొళ్ల నుంచి డి.రామారావును గుడిబండకు, రామగిరి నుంచి కె.ఆజాద్‌ను రొళ్లకు బదిలీ చేశారు. పదోన్నతిపై మరో ప్రాంతానికి బదిలీ అయిన వారిలో శెట్టూరుకు పి.మైథిలి (చెన్నేకొత్తపల్లి), బెళుగుప్పకు జీఎస్ రామచంద్ర (ధర్మవరం), గుమ్మఘట్టకు ఎస్.నరసింహమూర్తి (మడకశిర), కళ్యాణదుర్గానికి ఐ.సాల్మన్ (నంద్యాల), అనంతపురం రూరల్‌కు వై.పుల్లయ్య (నంద్యాల), గుంతకల్లుకు సి.వెంకటరమణప్ప (కర్నూలు), యల్లనూరుకు బి.వీర్రాజు (కర్నూలు), బ్రహ్మసముద్రం మండలానికి ఎస్.దాసానాయక్ (కర్నూలు), కుందుర్పికి కె.విజయశేఖర్‌రావు (కర్నూలు), కంబదూరుకు ఎం.సుధాకర్‌రాజు (కర్నూలు), బుక్కపట్నానికి పి.కృష్ణమోహన్‌బాబు (అనంతపురం), ఓబుళదేవరచెరువుకు కె.వరలక్ష్మి (కర్నూలు), కనగానపల్లికి టి.అలివేలమ్మ (అనంతపురం), చెన్నేకొత్తపల్లికి ఎస్.గంగావతి (అనంతపురం), తాడిమర్రికి బి.వి జయలక్ష్మి (బత్తలపల్లి), తలుపులకు బి.కిరణ్ మోహన్‌రావు (వైఎస్సార్ జిల్లా) ఉన్నారు.

పలువురు పీఆర్ ఇంజినీర్లకు స్థానచలనం

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 10 మంది ఇంజినీర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) భాగ్యరాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే కేటాయించిన స్థానాల్లో చేరిపోవాలని ఆదేశించారు.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
పి.సంగీత	పీఆర్ఐ డివిజన్, అనంతపురం	పీఐయూ సబ్ డివిజన్, పుట్టపర్తి
వై.రాజమ్మ	ఈఎన్‌సీ ఆఫీస్, విజయవాడ	పీఐయూ సబ్ డివిజన్-1, అనంతపురం
ఎస్‌వీ లక్ష్మీదేవి	ఈఎన్‌సీ ఆఫీస్, విజయవాడ	ఎస్ఈ పీఆర్, అనంతపురం
పి.మునుస్వామి	ఎంఈఓ, రాయదుర్గం	ఎంఈఓ, కంబదూరు
వై.చెంచయ్య	ఎంఈఓ, కణేకల్లు	ఎంఈఓ, కోవెలకుంట్ల
జి.ఉమాదేవి	పీఐయూ సబ్ డివిజన్, పెనుకొండ	ఈఎన్‌సీ, పీఆర్, విజయవాడ
ఎంకే దివ్య ప్రకాష్	ఎంఈఓ, గుత్తి	డీపీఆర్ఈఓ, తిరుపతి
ఎం.మాధవకృష్ణ	పీఐయూ సబ్ డివిజన్, ఉరవకొండ	పీఐయూ డివిజన్ ఆఫీస్, అనంతపురం
మల్లేష్‌నాయక్	పీఆర్ఐ, సబ్ డివిజన్, పెనుకొండ	ఎంఈఓ, గుత్తి
బి.సాయిసుమంత్	పీఐయూ డివిజన్, అనంతపురం	పీఐయూ సబ్ డివిజన్, ఉరవకొండ

నీటి కుంటలో పడి యువకుడి మృతి



నీటిలో తేలుతున్న శివకుమార్ మృతదేహం

హిందూపురం టౌన్: మండలంలోని మలుగూరు సమీపంలో ఉన్న నీటి కుంటలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మణేసముద్రం గ్రామానికి చెందిన శివకుమార్(35) గురువారం ఉదయం బహిర్భుమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందాడు. అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న హిందూపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్య జయంతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

స్కూటీ డిక్కీలోని రూ.8 లక్షల అపహరణ

ఉరవకొండ: స్కూటీ డిక్కీలో ఉంచిన రూ.8 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. బాధితుడు రామన్న, పోలీసులు తెలిపిన మేరకు.. ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి తలారి రామన్న, గురువారం ఉదయం తన కొడుకు చెన్నకేశవతో కలసి ఉరవకొండలోని కెనరా బ్యాంకుకు నగదు డ్రా చేసేందుకు వచ్చాడు. 11 గంటలకు రూ.8 లక్షలు డ్రా చేసి ఓ టవాల్‌లో చుట్టి స్కూటీ డిక్కీలో ఉంచారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని వాహనాన్ని బయటే ఉంచి డాక్యుమెంట్ రైటర్ కొమ్మసాని బాలచంద్ర కోసం లోపలకు వెళ్లి ఆరా తీశారు. అతను లేకపోవడంతో వెనక్కు వచ్చి స్కూటర్ వద్దకు చేరుకోగా డిక్కీ తెరిచి ఉన్నట్లుగా గుర్తించారు. అందులో ఉంచిన నగదు కనిపించలేదు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో సీఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి అక్కడకు చేరుకుని ఆరా తీశారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఉరవకొండ: మూడు రోజుల క్రితం స్థానిక ఇందిరా నగర్‌లోని రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం ఉరవకొండ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి వెల్లడించారు. గత నెల 28న ఇందిరానగర్‌లోని నజీర్, దయాకర్ ఇళ్లలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. మొత్తం 21తులాల బంగారంతో పాటు 30 తులాల వెండి, రూ.లక్ష నగదు అపహరణకు గురైంది. ఈ కేసును సవాల్‌గా స్వీకరించిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుడు గుంతకల్లుకు చెందిన షికారి రాజుగా గుర్తించారు. ఈ క్రమంలో రాజు కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు గురువారం ఉదయం నగలను విక్రయించేందుకు బళ్లారికి వెళుతుండగా ఉరవకొండ మార్కెట్ యార్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 8 తులాల బంగారం, అర కిలో వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, నిందితుడు రాజుపై జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో 11 కేసులు ఉన్నట్లుగా సమాచారం.

మొలకలపెంటను సందర్శించిన వైద్యాధికారులు



రోగికి వైద్య చికిత్స చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంటలో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి పేర్కొన్నారు. మొలకలపెంటలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందన్న ప్రచారం జోరుగా సాగిన నేపథ్యంలో డీఎంహెచ్‌ఓతో పాటు, డీపీఎంఓ డాక్టర్ చెన్నకేశవులు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, డీఈఎంఓ త్యాగరాజు తదితరులు గురువారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ రకాల జబ్బులతో బాధ పడుతున్న వారి ఇళ్ల వద్ద కెళ్లి, వారి వైద్య పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను పరిశీలించారు. గ్రామస్తులతో డాక్టర్ వీరబ్బాయి మాట్లాడుతూ.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.